APTEL/2008/28200

### జూన్ 3న బడి బాటలో భాగంగా గ్రామాల్లో పలు ఆర్గనైజేషన్లతో సమావేశాలు

హైదరాబాద్ : జూన్ 3 నుంచి 19వ తేదీ వరకు ఈ కార్యక్రమం తెలంగాణ వ్యాప్తంగా చేపట్టనుంది. కాగా ఈ బడిబాట కార్యక్రమాన్ని తొలుత జూన్ 1 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించాలని భావించింది. కానీ ఈ తేదీలను విద్యాశాఖ రీ షెడ్యూల్ చేసింది. బడి బాటలో భాగంగా స్కూల్ ఏజ్ పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్చేలా చూడాల్సి ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగేలా చూడాల్సి ఉంటుంది. చిన్నారులను అంగన్ వాడీ కేంద్రాల్లో కూడా చేర్పించాలని పేర్కొంది. కాగా బడిబాటలో భాగంగా కలెక్టర్ల నుంచి మొదలు డీఈవో, ఎంఈఓ, హెడ్ మాస్టర్, టీచర్ వరకు ప్రతి ఒక్కరికి ఒక్కో బాధ్యత అప్పగించారు. ఇదిలా ఉండగా జూన్ 3 నుంచి జూన్ 11 వరకు బడి బాటలో భాగంగా ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు వీరు పాల్గొనాల్సి ఉంటుంది. జూన్ 12 నుంచి పాఠశాలలు పున:ప్రారంభం కానున్న నేపథ్యంలో 11 వరకు కీలకంగా మారనుంది.



# తెలంగాణ ఫోకస్

తెలుగు దినపత్రిక


ప్రజల తెలంగాణ ప్రతిబింబం

### డెక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీని మూసివేయాలి

హుజూర్ నగర్ : హుజూర్ నగర్ నియోజకవర్గంలో పాలకీడు మండలం మహంకాళి గూడెం గ్రామంలో గ్రామ శివారులోని ఫారెస్టులో ఏమాత్రం అనుమతులు లేకుండా నడుపుతున్న డెక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీని వెంటనే మూసీవేయాలని ప్రపంచ పర్యావరణ సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ భద్ర డిమాండ్ చేశారు. హైదరాబాద్ హైదర్ గూడ ఎన్ఎస్ఎస్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈ ఫ్యాక్టరీ యాజమాన్యం న్యాయస్థానాలను , కాలుష్య నియంత్రణ మండలి, జాతీయ హరిత ట్రిబ్యునల్ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘన చేస్తుందని ఆరోపించారు. గత పాలకుల అండతో అధికారులు పూర్తిగా అవినీతిపరులకు వత్తాసు పలుకుతూ పర్యావరణ పరిరక్షణ కోసం పోరాడుతున్న పసుపులేటి సురేష్ ని చంపడానికి అనేక రకాల కుట్రలు పన్నారని ఆరోపించారు.

సంపుటి: 16 సంచిక : 30 కరీంనగర్ శుక్రవారం, మే 31, 2024 ఎడిటర్ : బోనగిరి నర్సింగ్ పేజీలు : 8 రూ. 2 రూపాయిలు

## ధ్యానం చేస్తే జ్ఞానం రాదు.. ప్రధాని మోదీపై ఖర్గే ఫైర్



లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి చివరి రోజున కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే ప్రధాని మోదీపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గాంధీజీపై ప్రధాని చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఏడోవిడత ఎన్నికల ప్రచారం గురువారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో మీడియాతో ఖర్గే మాట్లాడారు. మహాత్మాగాంధీ గురించి సినిమా చూసిన తర్వాత చాలామంది తెలుసుకున్నారని మోదీ చేసిన వ్యాఖ్యలపై ఖర్గే స్పందిస్తూ.. ప్రధానమంత్రి చదువుకుని ఉంటే ఇలాంటి మాటలు చెప్పువారుకాదన్నారు. ఆయన ప్రకటన ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. గాంధీ గురించి ప్రధానికి తెలియకపోతే రాజ్యాంగం గురించి కూడా తెలియదని అన్నారు. జూన్ 4 తర్వాత మోదీకి ఖాళీ సమయం దొరికితే గాంధీ ఆత్మకథ, సత్యంతో నా అనుభవాలు పుస్తకాలను తప్పక చదవాలన్నారు. ప్రధాని మోదీ రాజకీయాలు ద్వేషంతో నిండిపోయాయని ఖర్గే విమర్శించారు. 18వ లోక్‌సభ ఎన్నికల ప్రచారం గురువారం సాయంత్రంతో ముగుస్తుందని.. ఈ ఎన్నికలు చిరకాలం గుర్తుండిపోతాయని ఖర్గే పేర్కొన్నారు. దేశంలోని ప్రతి పౌరుడు కుల, మతాలకు అతీతంగా ఏకతాటిపైకి వచ్చి ఓట్లు వేశారన్నారు. మోదీ మాయమాటలను దేశ ప్రజలు నమ్మలేదన్నారు. జూన్4 తర్వాత కేంద్రంలో ఇండియా కూటమి ప్రభుత్వం రాబోతుందని ఖర్గే తెలిపారు.

# తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల వేళ ముదురుతున్న వివాదం

### రేపు తెలంగాణ సరిహద్దులు చెరిపేస్తారా?

### తెలంగాణ మ్యూజిక్ డైరెక్టర్లు ఎవరూ లేరా..?

### కాకతీయ కళాతోరణంపై, చార్మినార్‌పైన సీఎం రేవంత్‌కు ఎందుకంత కోపం?



హైదరాబాద్, మే 30 : తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల చుట్టూ వివాదం చెలరేగుతోంది. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర అధికారిక చిహ్నాన్ని మార్చడంతో పాటు తెలంగాణ గీతానికి కీరవాణితో మ్యూజిక్ కంపోజ్ చేయించడమే దీనికి ప్రధాన కారణం. రాజకీయ దురుద్దేశ్యంతో తెలంగాణ గుర్తులను మార్చుతున్నారని ఓ పక్క ప్రతిపక్షాలు మండిపడుతుంటే.. త్యాగాలు, పోరాటాలకు చిహ్నంగా రాష్ట్ర గీతం, రాష్ట్ర చిహ్నాన్ని తీర్చిదిద్దుతున్నామన్నారు సీఎం రేవంత్ రెడ్డి. అటు గీతం.. ఇటు చిహ్నంపై దశాబ్ది సంబురాల సాక్షిగా విమర్శలు పెరుగుతున్నాయి. తెలంగాణ అంటేనే పోరాటాలకు స్ఫూర్తి. నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా.. ప్రజలు గర్జించి ..నీళ్లు, నిధులు, నియామకాల కోసం గళమెత్తి సాధించుకున్న ఉద్యమ చరిత్ర. దశాబ్దాల కల నెరవేరి.. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం జరిగి పదేళ్లవుతోంది. దీంతో రాష్ట్ర అవతరణ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. జూన్ 2న అమరవీరులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించి.. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొంటారు. అక్కడే రాష్ట్ర ప్రత్యేక గీతాన్ని, రాష్ట్ర అధికారిక చిహ్నాన్ని నూతనంగా ఆవిష్కరించనున్నారు. ప్రముఖ తెలంగాణ కవి అందెశ్రీ రాసిన జయజయహే తెలంగాణ గీతంలో స్వల్ప మార్పులు చేయించి గీతానికి సంగీతాన్ని కంపోజ్ చేస్తోంది. ఈ బాధ్యతల్ని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణికి అప్పగించారు. ఇంతవరకూ బాగానే ఉన్నా.. తెలంగాణ గీతాన్ని మళ్లీ కంపోజ్ చేయడం దేనికనే ప్రశ్నలు బయల్దేరాయి. అంతేకాక కీరవాణి స్వరాలు సమకూర్చడంపైనా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. జయజయహే తెలంగాణ గీతాన్ని కంపోజ్ చేయడానికి తెలంగాణ మ్యూజిక్ డైరెక్టర్లు ఎవరూ లేరా..? అంటూ తెలంగాణ సినీ మ్యూజీషియన్స్ అసోసియేషన్ అభ్యంతరం తెలిపింది. దీనిపై డైరెక్టర్ ప్రేమ్‌రాజ్ .. గీత రచయిత అందెశ్రీకి ఫోన్ చేసి తమ అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. దీనిపై తీవ్రంగా స్పందించారు అందెశ్రీ. మరోవైపు తెలంగాణ రాష్ట్ర అధికారిక చిహ్నంలో మార్పులు, చేర్పులు చేస్తోంది రేవంత్ సర్కార్. రాష్ట్ర చిహ్నంలో ఉన్న కాకతీయ కళాతోరణం, చార్మినార్‌ను తొలగిస్తున్నారు. దీనికోసం నిజామాబాద్‌కు చెందిన కళాకారుడికి తెలంగాణ చిహ్నం రూపకల్పన బాధ్యతను అప్పగించారు. దీనిపైనా దుమారం రేగుతోంది. తెలంగాణ గీతం, చిహ్నంలో మార్పులు చేర్పులపై విపక్ష బీఆర్ఎస్ మండిపడుతోంది. కాకతీయ కళాతోరణంపై, చార్మినార్‌పైన సీఎం రేవంత్‌కు ఎందుకంత కోపమని ప్రశ్నిస్తోంది విపక్ష బీఆర్ఎస్.అధికారిక గీతంలో కాకతీయ కళాతోరణాన్ని, చార్మినార్‌ను కీర్తించి.. అధికారిక చిహ్నంలో మాత్రం అవమానిస్తారా..? అని విమర్శించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్. చార్మినార్ కేవలం ఒక కట్టడం కాదని.. విశ్వనగరమైన హైదరాబాద్‌కు ఇదో ఐకాన్ అన్నారు. ఇవాళ తెలంగాణ గుర్తులు మార్చి రేపు తెలంగాణ సరిహద్దులనూ చెరిపేస్తారా..? అంటూ ఎక్స్‌లో విమర్శించారు. శతాబ్దాల సాంస్కృతిక వైభవానికి చిహ్నాలుగా ఉన్న వాటిని తొలగిస్తారా..? అని అన్నారు. జయజయహే తెలంగాణ గీతంలో అసలు ఏముందో తెలుసా..? అని ప్రశ్నించారు.తెలంగాణ గీతంపై ఆత్మగౌరవ రాగం ఆలపిస్తోంది బీఆర్ఎస్. తెలంగాణ గీతానికి కీరవాణి సంగీతాన్ని అందించడంపై నేత ప్రవీణ్ కుమార్ అభ్యంతరం తెలిపారు. అందెశ్రీ రాసిన తెలంగాణ రాష్ట్ర గీతంపై ఆంధ్రా సంగీత దర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణి పెత్తనం ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడి పదేళ్లు గడిచాక.. గీత స్వర కల్పనకు మళ్లీ ఇప్పుడేం అవసరమొచ్చిందని ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఉన్న చిహ్నంలో కాకతీయ కళాతోరణాన్ని తొలగించడాన్ని వరంగల్ జిల్లా ప్రజలు, నేతలు వ్యతిరేకిస్తున్నారు. చార్మినార్‌ను తొలగించడాన్ని ఎంఐఎం తీవ్రంగా తప్పుబడుతోంది. తెలంగాణవాదులు, మేధావులు, మానవ హక్కుల నాయకులు మాత్రం దీన్ని స్వాగతిస్తున్నారు. పదేళ్ల తర్వాత అయినా తెలంగాణ రాష్ట్ర గీతాన్ని అధికారికంగా ఆవిష్కరిస్తుండటం సంతోషకరమైన విషయమని అంటున్నారు.

## దేశం కోసం 100 సార్లైనా జైలుకు వెళ్తా.. గర్వంగా ఉందన్న కేజ్రీవాల్



జలంధర్: దేశం కోసం 100 సార్లైనా జైలుకి వెళ్లడానికి సిద్ధమేనని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో మధ్యంతర బెయిల్ గడువు ముగుస్తుండటంతో జూన్ 2న ఆయన పోలీసులకు తిరిగి లొంగిపోవాల్సి ఉంది. "నేను స్వాతంత్ర సమరయోధుడు భగత్ సింగ్ అనుచరుడిని. దేశం కోసం ఎన్ని సార్లైనా జైలుకి వెళ్తా. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ 200 సీట్ల కంటే తక్కువ గెలుచుకుంటుంది. ఇండియా కూటమి 300 సీట్లకు పైగా గెలుచుకుంటుంది. నేను అవినీతికి పాల్పడ్డానని బీజేపీ ఆరోపిస్తోంది. కానీ సాక్ష్యాలు చూపించలేకపోతోంది. నేను అవినీతి చేస్తే ప్రపంచంలో ఇక ఎవరూ నిజాయతీపరులు మిగలరు. లిక్కర్ స్కాంలో రూ.100 కోట్లు దోచుకున్నారని అంటున్నారు. 500 చోట్ల దాడులు చేస్తే ఒక్క రూపాయి కూడా దొరకలేదు. అంటే వంద కోట్లు గాలిలో మాయమైపోయాయా. తమ వద్ద సాక్ష్యాలు లేవని, రికవరీ చేయలేదని, కేజ్రీవాల్ అనుభవజ్ఞుడైన దొంగ అని ప్రధాని మోదీ అన్నారు. సాక్ష్యాలు లేవని ప్రధాని అంగీకరించారంటేనే లిక్కర్ స్కాం అనేది ఫేక్ అని అర్థం చేసుకోవచ్చు. నేను చేస్తున్న పనిని మోదీ చేయలేదు. అందుకే నన్ను అరెస్ట్ చేశారు. పంజాబ్, ఢిల్లీవాసులకు విద్యుత్తును ఉచితంగా అందించాం. మంచి ఆసుపత్రులు, మొహల్లా క్లినిక్ వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు ప్రజల కోసం తీసుకొచ్చాం. మోదీ ఇవ్వని చేయలేదు. అందుకే నన్ను జైలులో పెట్టారు. ఆమ్ ఆద్మీ పార్టీ గొంతు అణచివేయాలని ప్రయత్నిస్తున్నారు. ప్రపంచంలోని ఏ శక్తి కూడా మమ్మల్ని ఆపలేదు. నేను జూన్ 2న తిరిగి జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాను.దేశాన్ని రక్షించుకోవడానికి జైలుకు వెళ్తున్నందుకు గర్వపడుతున్నాను. పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వాన్ని కూల్చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ప్రజా ప్రభుత్వాన్ని కూలదోయాలని ప్రయత్నించిన వారికి ప్రజలే బుద్ధి చెబుతారు.ఇలాంటి గుండాగిరిని ఇంతకు ముందు చూడలేదు. దీనికి వ్యతిరేకంగా మేం గళం విప్పుతున్నాను. అలాంటి గుండాగిరికి వ్యతిరేకంగా నేను జైలుకు వెళతాను" అని కేజ్రీవాల్ అన్నారు.

## రాజకీయ కక్షతోనే రాజముద్రను మారుస్తున్నారు : కేటీఆర్ ఫైర్




హైదరాబాద్, మే 30 : తెలంగాణ అధికారిక చిహ్నంలో మార్పులు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది.. చిహ్నంలో మార్పులు చేర్పులపై కసరత్తులు జరుగుతున్నాయి.. ప్రజలు, ప్రజాజీవితం, ప్రజాస్వామ్యం, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి, అమరుల త్యాగం తదితర అంశాలు ప్రతిబింబించేలా దీనిని రూపొందించేందుకు రేవంత్ సర్కార్ నిర్ణయించింది.. అయితే, అంతకుముందున్న చిహ్నంలోని చార్మినార్, కాకతీయ కళాతోరణాన్ని తొలగిస్తారనే ప్రచారం జరుగుతుండటంతో బీఆర్ఎస్ నిరసనలకు పిలుపునిచ్చింది. తెలంగాణ చిహ్నం మార్పుపై గురువారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలుపుతోంది బీఆర్ఎస్. హైదరాబాద్ చార్మినార్ దగ్గర జరిగిన నిరసనలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. చిహ్నంపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. ఉద్దేశపూర్వకంగానే రాజముద్రను సర్కార్ మారుస్తోందని చెప్పారు. కేసీఆర్ పేరు వినిపించకూడదన్నట్టుగా కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ చారిత్రక కట్టడాలైన చార్మినార్, కాకతీయుల కళాతోరణాన్ని లోగోలో ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు కేటీఆర్. రాజకీయ కక్షతోనే రాజముద్రను మారుస్తూ.. మూర?పు నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. అంతకుముందు రాష్ట్ర చిహ్నం నుంచి చార్మినార్ ను తొలగించడంపై కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. చార్మినార్ దశాబ్దాల తరబడి హైదరాబాద్‌కు ఐకాన్‌గా ప్రపంచంలోనే గుర్తింపు పొందిందని.. నగరం గురించి ఎవరైనా ఆలోచిస్తే వారు ప్రపంచ వారసత్వ హోదా పొందేందుకు అన్ని అర్హతలున్న చార్మినార్ గురించి ఆలోచించకుండా ఉండలేరని చెప్పారు. కానీ ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పనికిరాని కారణాలను సాకుగా చూపుతూ చార్మినార్‌ను రాష్ట్ర అధికారిక ముద్ర నుంచి తొలగించాలని భావిస్తోందంటూ ఎక్స్ లో రాశారు.

## భారత సరిహద్దు వెంబడి చైనా కుటిల యత్నాలు.. పుట్టగొడుగుల్లా సైనిక గ్రామాలు!



మే 30 : డ్రాగన్ కంట్రీ కంత్రి పనులకు అడ్డుకట్ట పడటంలేదు. ఎప్పుడూ ఏదో ఒక రూపంలో ప్రపంచవ్యాప్తంగా ఆందోళన క్రియేట్ చేస్తోంది. ఇప్పటికే ప్రపంచంలోని అనేక దేశాలు చైనాపై గూఢచర్యం, హ్యాకింగ్ ఆరోపణలు చేస్తూనే ఉన్నాయి. మరోవైపు అరుణాచల్‌పై అడపాదడపా వాతం పట్టుకుని, మూర్ఛరోగిలా గిలాగిలా కొట్టుకోవడం చైనాకు అలవాటే పోయింది. నైన్టీన్ ఫిఫ్టీస్ తర్వాత హిందీ-చీనీ భాయీభాయీ అంటూ చాచానెహ్రూ ఇచ్చిన నినాదం.. ఆ తర్వాత వన్‌సైడ్ లవ్వుగా మిగిలిపోయింది. రెండు దేశాల మధ్య 3500 కిలోమీటర్ల సరిహద్దు వివాదం కారణంగా 1962లో చైనాతో నేరుగా యుద్ధమే చెయ్యాల్సి వచ్చింది. టిబెట్‌తోపాటు అరుణాచల్ కూడా తమదే అంటూ తమ ఇంటర్నేషనల్ మ్యాపుల్ని చూపించేది. ఇక్కడ భారత దేశంలోనే అతిపెద్ద బౌద్ధ మందిరం ఉన్న తవాంగ్ ఉత్తర భాగం కూడా తమదేనని చెప్పుకునేది చైనా. 1962 యుద్ధంలో గెలిచినా తవాంగ్ నుంచి వెనక్కు వెళ్లిపోయింది చైనా. ఆ తర్వాత భారత్ ఈ ప్రాంతంపై పూర్తిగా పట్టు సాధించింది. అయితే తాజాగా భారత్‌తో సరిహద్దుకు సమీపంలో డ్యూయల్ యూజ్ గ్రామాలను నిర్మించడంలో చైనా బిజీగా ఉంది. ఇది కాకుండా, సైనిక సౌకర్యాల నెట్‌వర్క్‌ను విస్తరిస్తోంది కంత్రీ కంట్రీ. నిర్జనమైన, ఎవరు చేరుకోలేని హిమాలయాలలో, చైనా భారతదేశంతో తీవ్ర వివాదాస్పద సరిహద్దులో వందలాది గ్రామాలను నిర్మిస్తోందని వాషింగ్టన్ థింక్ ట్యాంక్ సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్ (%జూ×ూ%) మే 16న ఒక కొత్త నివేదిక పేర్కొంది. జియోస్పేషియల్ డేటా ప్రొవైడర్ సెంటినెల్ హబ్ నుండి వచ్చిన ఉపగ్రహ చిత్రాలు 2022 %-% 2024 మధ్య దాని విస్తరణను చూపుతున్నాయి న్యూస్‌వీక్ పేర్కొంది. భారత్ విషయంలో చైనా తన దమననీతిని ప్రదర్శిస్తునే ఉంది. ఇటీవల విడుదల చేసిన 2023 ప్రామాణిక మ్యాప్‌లో మొత్తం అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రం, అక్సాయ్ చిన్ ప్రాంతమంతా తమ భూభాగమని చైనా ప్రకటించుకుంది. ఆగస్టు 28న విడుదల చేసిన ఈ మ్యాప్‌లో అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాన్ని దక్షిణ టిబెట్‌గా పేర్కొంది. 1962 యుద్ధంలో ఆక్రమించుకున్న అక్సాయ్ చిన్ ప్రాంతం తమదని చైనా పేర్కొంది. అంతే కాదు తైవాన్, వివాదాస్పద దక్షిణ చైనా సముద్రాన్ని కూడా తమ భూభాగమేనని మ్యాప్ ద్వారా చైనా చూపింది. చైనా సర్వేయింగ్, మ్యాపింగ్ పబ్లిసిటీ డే వేడుకల్లో భాగంగా చైనా ఈ మ్యాప్ విడుదల చేసింది. మరో వైపు అరుణాచల్ ప్రదేశ్ ఎప్పుడూ తమ భూభాగమేనని, అది ఎప్పటికీ అలాగే ఉంటుందని అనేక సందర్భాల్లో భారత్ స్పష్టం చేసింది. కానీ తాజాగా %జూ×ూ% నివేదిక ప్రకారం అరుణాచల్ ప్రదేశ్ సమీపంలోని నాలుగు వేర్వేరు ప్రదేశాలలో సైనిక, ద్వంద్వ వినియోగ గ్రామ మౌలిక సదుపాయాల విస్తరణను చేపట్టినట్లు వెల్లడించింది. ఇది యారోతో పాటు జువాంగ్నాన్, మజిదున్‌కున్, కుయికియోంగ్‌మెన్‌లలో సైనిక సౌకర్యాలను విస్తరించినట్లు వెల్లడించింది. అరుణాచల్ భారతదేశంలో అంతర్భాగమైన ప్రాంతం. అయితే చైనా దానిని తమ భూభాగంగా పేర్కొంటోంది. గ్రేజోన్ వ్యూహంతో సరిహద్దులో చైనా గ్రామాలను నిర్మిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు రహస్యంగా దూకుడు సైనిక దళాలను ఈ ప్రాంతంలో మోహరించవచ్చని హెచ్చరించారు.

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి: హరీశ్ రావు



హైదరాబాద్: నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులకు తక్షణవే పెండింగ్ జీతాలు చెల్లించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంఓ బాధాకరమన్నారు. ప్రజల ఆరోగ్యాలను సంరక్షించేందుకు నిరంతరం కృషి చేసే వైద్య సిబ్బందికి నెలలుగా జీతాలు చెల్లించకపోవడం ప్రజారోగ్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి ఇది అద్దం పడుతున్నదని విమర్శించారు. ప్రతి నెల 1వ తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు ఒట్టి డొల్ల అని చెప్పడానికి ఇది మరో నిదర్శనమంటూ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు. 'నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్ హెచ్ ఎం) పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం 3 నెలలుగా జీతాలు చెల్లించకపోవడం బాధాకరం. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు, తెలంగాణ డయాగ్నోస్టిక్స్ తదితర 78 విభాగాలలో పనిచేస్తున్న 17,541 మంది జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల ఆరోగ్యాలను సంరక్షించేందుకు నిరంతరం కృషి చేసే వైద్య సిబ్బందికి నెలలుగా జీతాలు చెల్లించకపోవడం ప్రజారోగ్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి ఇది అద్దం పడుతున్నది. ప్రతి నెల 1వ తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు ఒట్టి డొల్ల అని చెప్పడానికి ఇది మరో నిదర్శనం. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి 3 నెలల పెండింగ్ జీతంతో పాటు, పీఆర్సీ బకాయిలను తక్షణమే చెల్లించాలని ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను.' అని హరీశ్‌రావు ట్వీట్ చేశారు.

# చందుర్తి పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్.



చందుర్తి పోలీస్ స్టేషన్ ను గురువారం రోజున ఆకస్మిక తనిఖీ చేసి పోలీసు స్టేషన్ పరిసరాలు,రికార్డుల నిర్వహణపైలోతుగా పరిశీలించారు.విధుల్లో భాగంగా పోలీసులు మెయింటేన్ చేసే రిసెప్షన్, జీడీ ఎంట్రీ తదితర రికార్డును ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.మారుతున్న నేరాల నమూనాకు అనుగుణంగా గస్తీ, పెట్రోలింగ్ లను పెంచాలన్నారు. పోలీస్ స్టేషన్లలో క్రైమ్ పాట్రాన్స్, ఫంక్షనల్ వర్టీకాల్స్ పనితీరు పరిశీలించారు. అనంతరం ఎస్పీ గారు మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని,ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో రోజు ఎన్ని బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ విధులు నడుస్తున్నాయని అడిగి తెలుసుకొని ప్రాపర్ గా పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని, బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ నిరంతరం 24%ఇ%7 గస్తీ నిర్వహించాలని,సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాలకు సంబంధించిన పూర్తి సమాచారం అందరి దగ్గర ఉండాలని,గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగినా పై అధికారులకు తక్షణమే తెలియజేయాలని సూచించారు, పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది అందరి కృషి చేయాలని సిబ్బంది, అధికారులు అందరూ విధులు సక్రమంగా నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని సూచించారు. ఎస్పీ వెంట సి.ఐ వేముకటేశ్వర్లు, ఎస్.ఐ శ్రీకాంత్, సిబ్బంది అన్నారు.

# తోట ముత్యాలమ్మ గుడిలో ప్రత్యేక పూజలు - హాజరైన మల్కాజ్గిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి



మల్కాజ్గిరి మే 2, తెలంగాణ నుండి ఫోకస్ ప్రతినిధి : మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి భారీ మెజారిటీతో విజయం సాధించాలని కోరుకుంటూ అల్వాల్ తోట ముత్యాలమ్మ తల్లి ఆలయంలో అల్వాల్ సొసైటీ మాజీ ఛైర్మన్ తోట దశ్మంత్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు అమ్మవారికి వెయ్యి నూట పదహారు కొబ్బరికాయలు కొట్టారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మల్కాజ్ గిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి హాజరయ్యారు. తన గెలుపు కోసం అమ్మవారి ఆశీస్సులు తీసుకోవాలని అల్యాన్ని సందర్శించినట్లు సునీత మహేందర్ రెడ్డి తెలిపారు. అమ్మ వారి ఆశీస్సులతో తనకు విజయం చేకూరుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోజిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, నరసింహారెడ్డి, సుదర్శన్ రెడ్డి, కిషన్ పటేల్, శ్రీనివాస్ రెడ్డి, జీడి నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# హనుమాన్ శోభయాత్ర పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ పట్టణంలోని హనుమాన్ దీక్ష సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్రలో వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు వేములవాడ మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్థం మాధవి రాజు సిరిసిల్ల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు ప్రతాప్ రామకృష్ణ రాపల్లి శ్రీధర్ టిఆర్ఎస్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగు మనోహర్ రెడ్డి కట్కూరు శ్రీనివాస్ కాంగ్రెస్ నాయకులు పుల్కం రాజు సాగరం వెంకటస్వామి చంద్రగిరి శ్రీనివాస్

# 10 ఏళ్లలో 60 వేల మంది తగ్గారు



**అదిలాబాద్, మే :** తెలంగాణ సిరుల గని సింగరేణిలో ఒకప్పుడు లక్షకు పైగా కార్మికులు పనిచేసేవారు. అలాంటిది సింగరేణిలో బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కార్మికుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. రాష్ట్రంలో సింగరేణి పరిధి వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో కార్మికుల సంఖ్య దాదాపు 40 వేలకు పడిపోయింది. బీఆర్ఎస్ హయాంలో గడచిన 5 సంవత్సరాలలో బాగా తగ్గుముఖం పట్టింది. కొత్తగా నియామకాలు చేపట్టకపోగా..కార్మికుల సంక్షేమ పథకాలన్నీ అటకెక్కించేశారు. దీనితో ఉన్న కార్మికులే వేరే ఉద్యోగాలు వెదుక్కునే పరిస్థితి కల్పించారు బీఆర్ఎస్ నేతలు. దీనితో ప్రతిష్టాత్మక సింగరేణి సంస్థ మనుగడకే ప్రమాదం వాటిల్లే పరిస్థితి వచ్చింది. శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ప్రాంతాల పరిధిలో ఐదేళ్ల క్రితం సుమారు 21 వేల మంది ఉన్న కార్మికులు ప్రస్తుతం 14 వేలకు చేరారు. అయితే తెలంగాణలో కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి విస్తరణపై దృష్టి పెట్టింది. కాస్ట్‌లో పంప్డ్‌స్టోరేజీ హైడ్రో పవర్ ప్లాంట్‌తో పాటు సింగరేణి విస్తరించిన ఆరు జిల్లాల్లో ఓపెన్ కాస్ట్ మట్టి గుట్టలపై విండ్ పవర్ ఉత్పత్తి చేసేందుకు ఫోకస్ చేసింది. ఈ విషయాలపై సింగరేణి సంస్థ ఉన్నతాధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి రిపోర్ట్ ఇచ్చారు. పార్లమెంట్ రిజల్ట్ అనంతరం ప్రభుత్వ నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.దాదాపు ఆరు జిల్లాలలో విస్తరించిన సింగరేణి సంస్థ మొదట్లో బొగ్గు ఉత్పత్తి, రవాణాపైనే ఫోకస్ పెట్టింది. 2016లో జైపూర్ ప్లాంట్ లో రెండు యూనిట్ల ద్వారా 1,200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించింది. తర్వాత మొదటి దశలో తొమ్మిది ప్రాంతాలలో 13 సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసి 235 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని చేస్తున్నారు. రెండో దశలో భాగంగా 232 మెగావాట్ల సోలార్ పవర్ ను ఉత్పత్తి చేసేందుకు వీలుగా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా మందమర్రిలో 67.5 మెగావాట్ల ప్లాంట్, రామగుండం పరిధిలోని ఓవర్ బర్డెన్ డంప్ లో 37 మెగావాట్ల ప్లాంట్, శ్రీరాంపూర్ ప్రాంతంలో 27.5 మెగావాట్ల ప్లాంట్, కొత్తగూడెంలో 32.5 మెగావాట్ల ప్లాంట్, జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ సెంటర్ ఆవరణలో 32.5 మెగావాట్ల ప్లాంట్, ఇల్లందులో 37.5 మెగావాట్ల ప్లాంట్ ను నిర్మాణం చేయనున్నారు. ఇక జైపర్ వవర్ ప్లాంట్ ను విస్తరించడంలో భాగంగా రెండో దశలో 800 మెగావాట్ల మూడవ యూనిట్ ను నిర్మించేందుకు ఇప్పటికే శంకుస్థాపన చేశారు. ప్లాంట్ ఆవరణలోనే రూ.5,900 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్నారు.సంస్థ ఉత్పత్తి పెరిగినప్పటికీ కార్మికుల సంఖ్య అధికంగా ఉందన్న నెపంతో బీఆర్ఎస్ సూచనల ప్రకారం సంస్థ యాజమాన్యం కార్మికులను తగ్గించే పన్నాగం పన్నింది. గోల్డెన్ షేక్‌హ్యాండ్ పథకాన్ని తెరపైకి తేవడం ద్వారా సర్వీసు మిగిలి ఉండగానే కార్మికులను ముందస్తుగా ఉద్యోగాల్లో నుంచి తొలగించే ప్రక్రియకు నాంది పలికింది. అలా ప్రారంభమైన కార్మికుల ఏరివేత కారణంగా సింగరేణి వ్యాప్తంగా వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. బొగ్గు ఉత్పత్తిపై సింగరేణి యాజమాన్యం చూపుతున్న శ్రద్ధ సంస్థ మనుగడపై చూపడం లేదనే అభిప్రాయాలు ఉన్నాయి. అండర్ గ్రౌండ్ గనులను క్రమంగా మూసి వేస్తున్న యాజమాన్యం, వాటి స్థానంలో ఓపెన్‌కాస్టు గనులను తెరపైకి తెచ్చింది. . రామకృష్ణాపూర్ ఓసీ మూతవేతకు సిద్ధంగా ఉండగా, దాని జీవితకాలం పెంచే అవకాశంపై బీఆర్ఎస్ ఏనాడూ దృష్టి సారించలేదు. ఆర్కే ఓసీ వద్ద షాఫ్ట్‌బ్లాక్ మైన్ ప్రారంభిస్తే జీవితకాలం పెరిగి ఉద్యోగావకాశాలు మెరుగుపడే అవకాశాలున్నాయి అయినప్పటికీ బీఆర్ఎస్ వీటిపై ఏనాడూ ఫోకస్ పెట్టలేదు.స్థిరమైన ఇంధన వనరులను వినియోగించుకొని ముందుకు సాగాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన మేరకు సింగరేణి సంస్థ కార్యాచరణను రూపొందించుకుంది. ఇందులో భాగంగా ఇల్లందు సమీపంలోని జేకే ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ వద్ద అనుకూలంగా ఉండడంతో పంప్డ్‌స్టోరేజ్ హైడ్రో పవర్ ప్లాంట్ ఏర్పాటుకు సింగరేణి సంస్థ ప్రణాళికలు రెడీ చేసింది. కింది ప్రాంతంలో డ్యామ్‌ను నిర్మించి అందులో స్టోర్ అయిన నీటిని పంప్‌ల ద్వారా ఎత్తైన ప్రాంతానికి పంపించి తిరిగి కిందకు తీసుకువస్తూ టర్బైన్లను తిప్పడం వల్ల పవర్ జనరేట్ అవుతుంది. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. ఇలా పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్లాంట్‌ను నెలకొల్పడానికి సింగరేణి సంస్థ అన్ని ఏర్పాట్లు చేసుకుంది.

# పాఠశాల పున ప్రారంభానికి ముందే అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులు పూర్తి చేయాలి - జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



పెద్దపల్లి, మే -30: పాఠశాల పున:ప్రారంభ సమయానికి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తిచేసి విద్యార్థుల కోసం పాఠశాలను సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామంలో ఉన్న జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పాఠశాలలో ఉన్న వసతులు వంటి అంశాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సంఖ్య అనుగుణంగా బాలికలకు బాలురకు ప్రత్యేకంగా టాయిలెట్లు అవసరమైన మేర నిర్మించాలని, 10 మంది బాలికల ఒక టాయిలెట్ ఉండాలని, బాలుర కోసం అధికంగా యూరినల్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పాఠశాలలో అవసరమైన చిన్నచిన్న వసతులు కల్పించేందుకు ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీల వద్ద మొదటి దశ లో 25 వేల రూపాయల నగదు అందుబాటులో ఉంచిందని, వీటిని ఎటువంటి అనుమతి లేకుండా అత్యవసర నిధుల కింద అమ్మ ఆదర్శ కమిటీలు ఖర్చు చేయవచ్చని, సంబంధిత బిల్లులను సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలకు అవసరమైన చిన్న చిన్న రిపేర్లు, తరగతి గదిలో అవసరమైన ట్యూబ్ లైట్ , ఫ్యాన్, ఇతర సామాగ్రిని ఎటువంటి అనుమతి లేకుండా అమ్మ ఆదర్శ కమిటీలు తమ వద్ద ఉన్న 25 వేల రూపాయలతో నేరుగా కొనుగోలు చేయవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు పాఠశాలలో చేపట్టాల్సిన ఇతర అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు రూపొందించి అనుమతులు జారీ చేస్తే ప్రతిపాదనల్లో 25% మేర మొబలైజేషన్ అడ్వాన్స్ మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. పాఠశాలలు పునఃప్రారంబించే సమయానికి ప్రతిపాదిత అభివృద్ధి పనులను అమ్మ ఆదర్శ కమిటీలు పూర్తిచేయాలని, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రాబోయే విద్యా సంవత్సరంలో విద్యాబోధన జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాలల్లోనే టాయిలెట్లను, హ్యాండ్ వాష్ లను, పరిసరాలను నీరు నిలవకుండా పరిశుభ్రంగా నిర్వహించేందుకు పక్కా కార్యాచరణ రూపొందించాలని, పాఠశాల సంబంధించిన గేట్ మరమ్మతులు, ఇతర పనులను చేసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, డి.ఆర్.డి.ఓ ఆర్.రవీందర్,జిల్లా పాఠశాల అకాడమిక్ మానిటరింగ్ అధికారి డాక్టర్ పి.ఎం. షేక్, పాఠశాల హెడ్ మాస్టర్ పురుషోత్తం, ఎంఈఓ సురేందర్, ఏపిఎం దివ్య, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్పర్సన్ శ్వేత, క్లస్టర్ మెంబర్ రజిత, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# వేములవాడలో ఘనంగా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు





రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పాత సత్యలక్ష్మి ఆధ్వర్యంలో రోగులకు పండ్ల పంపిణీ తెలంగాణ రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పాత సత్యలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అరుణ్ తేజ చారి, అంబాటి చందు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# జయ జయహే తెలంగాణ గీతంపై బిఆర్ఎస్ వారు అనవసరపు రాద్ధాంతం చేస్తున్నారు : ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్



జయ జయహే తెలంగాణ గీతంపై బిఆర్ఎస్ వారు అనవసరపు రాద్ధాంతం చేస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ ఉద్యమ పేరుట అధికారంలోకి వచ్చిన కేసిఆర్ 10 సంవత్సరాలు తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలించి కనీసం రాష్ట్రానికి జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించలేదని అన్నారు. నేడు తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి జయ జయహే తెలంగాణ గేయాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటిస్తామంటే కేసీఆర్ కేటీఆర్ అనవసరపు రాద్ధాంతం చేస్తున్నారన్నారు. తెలంగాణ గుండె తడి తెలిసిన అణగారిన వర్గానికి చెందిన అందెశ్రీకి ఇస్తే బిఆర్ఎస్ వారు తట్టుకోలేకపోతున్నారు. గీతాన్ని ఎంఎం కీరవాణి కంపోజ్ చేస్తే అతన్ని ఆంధ్ర మూలాలున్న వారిగా కెసిఆర్ కేటీఆర్ ఇస్తున్నారని మరి ఆనాడు ఆంధ్ర కోడలు సమంతను తెలంగాణ చేనేత బ్రాండ్ అంబాసిడర్ గా, ఆంధ్ర అమ్మాయి మంచు లక్ష్మిని తెలంగాణ స్వచ్ఛభారత్ బ్రాండ్ అంబాసిడర్ గా, రాష్ట్రానికి సంబంధం లేని రకుల్ ప్రీత్ ని బాలిక విద్యకు బ్రాండ్ అంబాసిడర్ గా కేటీఆర్ నియమించినప్పుడు మీకు తెలంగాణ సోయి గుర్తుకు రాలేదా అని యాదాద్రి ఆర్కిటెక్ట్ గా ఆంధ్ర సాయిని నియమించినప్పుడు మీ పౌరుషం ఎక్కడికి పోయిందని ధ్వజమెత్తారు..

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం : కలెక్టర్ అనురాగ్ జయంతి



సిరిసిల్ల, మే 30 : జిల్లాలో ఖరీఫ్ సాగు కోసం విత్తనాలు, ఎరువులకు ఎలాంటి కొరత లేదని కలెక్టర్ అనురాగ్ జయంతి ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. జిల్లాలో ఖరీఫ్ సాగులో భాగంగా వరి, పత్తి ఇతర పంటల విత్తనాలు, ఎరువులకు ఎలాంటి కొరత లేదని పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఎరువుల దుకాణ డీలర్లు కృత్తిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని రైతులందరూ ఈ విషయాన్ని గమనించి, ఎవరూ ఆందోళనలకు గురికాకుండా సహకరించాలని కోరారు.

# రాజన్నను దర్శించుకున్న భద్రాచల శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ఈఓ రమాదేవి



భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ ఈఓ. ఎల్. రమాదేవి రాజన్న ను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి కోడే మొక్కు చెల్లించుకున్నారు, ఆలయ అర్చకులు స్వామివారి కల్యాణ మండపంలో వేదోక్త ఆశీర్వచనము చేసినారు ,ఆలయ ఏఈఓ బ్రహ్మన్న గారి శ్రీనివాస్ లడ్డు ప్రసాదం అందజేసినారు. రాజన్న ఆలయ ఈఓ రామకృష్ణ కు భద్రాచల శ్రీ రామచంద్ర స్వామి వారి ప్రసాదం అందజేసిన ఈఓ ఎల్ రమాదేవి.వారి వెంట ప్రోటోకాల్ పరివేక్షకులు సిరిగిరి శ్రీరాములు, ఆలయ పరివేక్షకులు అలీ శంకర్ ,వరి నరసయ్య, ఆలయ ఇన్స్పెక్టర్ సంక పెల్లి పవన్, సి సి ఎడ్ల శివసాయి ఉన్నారు

Edited, Printed, Published and Owned by B. Narsingh, Printed at Vijetha Graphics & Offset Printers, H.No. 19-6-109, Godavarkhani,Karimnagar, Telangana State.
Published at H.No. 15-4-76/4, Jawaharnagar, Godavarikhani, Karimnagar, Telangana State,. Editor B. Narsingh, Email : kranthi995@gmail.com, tnfocus5@gmail.com
Website : telangananundifocus.com Cell : 7995282199, 9959954795.